క్లుప్తంగా

గునుగల్‌లో పెద్దమ్మతల్లికి పూజలు



పూజలో పాల్గొన్న శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

యాచారం: మండల పరిధిలోని గునుగల్ గ్రామంలో శనివారం పెద్ద దేవాలయంలోని పెద్దమ్మ తల్లికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఏడాది పూర్తయిన సందర్భంగా గ్రామస్తులు ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కె. శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ, నాయకులు ముత్యాల వెంకట్‌రెడ్డి, మచ్చ లక్ష్మణ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సామల యాదగిరికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న పీఆర్టీయూ నేతలు

ఇబ్రహీంపట్నం: పీఆర్టీయూ వ్యవస్థాపకుడు సామల యాదగిరి వర్ధంతిని పురస్కరించుకొని శనివారం స్థానిక మండల అధ్యక్షుడు పి పరమేశ్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులను సంఘటితం చేసేందుకు, వారి సమస్యల పరిష్కారానికి యాదగిరి చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, ఆనంద్, మహేశ్, హరిప్రసాద్, శేషు, సంపత్‌లు పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహా స్వామి ఆలయంలో 'మర్రి' పూజలు



కొంగరకలాన్‌లో పూజలు చేసిన నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: శ్రీలక్ష్మీ నర్సింహా స్వామి బ్రహ్మోత్సవాలు ఆదిబట్ల మున్సిపాలిటీలోని కొంగరకలాన్‌లో శనివారం ఘనంగా జరిగాయి. ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, పల్లె గోపాల్‌గౌడ్‌లు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వనం శ్రీనివాస్, హరిదాసుగౌడ్, కల్వకొలు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుళ్లిన ఆహార పదార్థాలు విక్రయిస్తే చర్యలే



తనిఖీ చేస్తున్న ఆదిబట్ల కమిషనర్ బాలకృష్ణ

ఇబ్రహీంపట్నం రూరల్: హోటల్ నిర్వాహకులు కుళ్లిన ఆహారపదార్థాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఆదిబట్ల మున్సిపాలిటీ కమిషనర్ బాలకృష్ణ పేర్కొన్నారు. శనివారం ఆదిబట్ల మున్సిపాలిటీలోని కృతుంగ, మన రుచులు, హర్షిత గ్రాండ్ హోటళ్లల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఫ్రిజ్‌లలో పెట్టిన మాంసహారాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ బాలకృష్ణ మాట్లాడుతూ అపరిశుభ్రంగా పెడితే సహించేది లేదన్నారు. కుళ్లిన ఆహార పదార్థాలు విక్రయించిన చర్యలు ఉంటాయని చెప్పారు. హోటల్ యజమానులు తప్పని సరిగా నిబంధనలు పాటించాలని లేకుంటే తగిన జరిమానా విధిస్తామన్నారు. అవసరమైతే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాల్‌మెంట్ ఇంజనీర్ సురేశ్, శానిటేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు .

'గురునానక్'లో కల్చరల్ ఫెస్ట్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ విద్యాసంస్థలో శనివారం యువ్‌నిక్స్ 2కె24 పేరుతో కల్చరల్ ఫెస్ట్‌ను జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ హెచ్‌ఎస్ సైని మాట్లాడుతూ విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని, సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ వేదిక ఏర్పాటు చేశారన్నారు. డైరెక్టర్ వెంకటరావు, జాయింట్ డైరెక్టర్ పార్థసారథి, ఈవెంట్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.



లక్ష్మీనృసింహాస్వామి దేవాలయం



దేవాలయంలో ఉత్సవ విగ్రహాలు

నృసింహాస్వామి ఆలయం చూద్దాం రారండి

- అతి పురాతన దేవాలయంగా ప్రసిద్ధి
- పర్యాట కేంద్రంగా అభివృద్ధి
- ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలు
- 30న స్వామివారి కల్యాణం

తలకొండపల్లి: హైదరాబాద్‌కు దగ్గరలో 55 కిలోమీటర్ల దూరంలో కడ్తాల్–కల్వకుర్తి మీదుగా శ్రీశైలం ప్రధాన రహదారి, క్రాస్ రోడ్డు నుంచి 3 కిలోమీటర్ల దూరంలో తలకొండపల్లి మండల కేంద్రం శివారు ప్రాంతంలో శ్రీ నృసింహ్మస్వామి ఆలయం ఉంది. యాదగిరి గుట్ట శ్రీలక్ష్మీనరసింహ్మ స్వామి ఆలయంగా ప్రసిద్ధి గాంచింది. ఈ నెల 30న ఆలయంలో లక్ష్మీనృసింహ్మ స్వామి కల్యాణం జరుగనుంది. కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా ప్రసిద్ధి పొందింది. ఈ ఆలయంలో ఆగమ శాస్త్రం ప్రకారం శాస్త్రోక్తంగా నిత్యోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ, అధ్యయనోత్సవ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఆలయాన్ని చూడడానికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలి వస్తుంటారు.

ఆలయ చరిత్ర..

సుమారు 1000 సంవత్సరాల క్రితం వెలసిన అతి పురాతన దేవాలయం. మొదట ఈ ఆలయం చిన్నదిగా ఉండేది. స్థానిక నాయకుడు, జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ సొంత ఖర్చులతో ఆలయ అభివృద్ధికి సహాయసహకారం అందజేశాడు. సుమారు రూ.3కోట్లు వెచ్చించి సీసీ రోడ్డు, వంటశాల, భోజనశాల, హనుమాన్ ఆలయం, నవగ్రహాల గుడి, లక్ష్మీనృసింహ్మస్వామి ఆలయం, ధ్వజస్తభం, తదితర వాటిని నిర్మింపజేశాడు. ఆలయాభివృద్ధి జరగడంతో ఇక్కడ రోజురోజుకు భక్తుల తాకిడి ఎక్కువైంది. దీంతో రద్దీ కూడా పెరిగింది.

పర్యాటక కేంద్రంగా చేయాలి..



బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలి వస్తుంటారు. ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి. ఈ విషయాన్ని సంబంధిత అధికారులతో పాటు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకు వెళ్లినట్లు ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రభుత్వ పరంగా నిధులు మంజూరు చేసి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తే ఆలయం మరింత అభివృద్ధి చెందుతుంది. -ఉప్పల వెంకటేశ్, జెడ్పీటీసీ సభ్యుడు, తలకొండపల్లి

29న బ్రహ్మోత్సవాలు

ఈ నెల 29న ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభమై 30 వరకు నిర్వహిస్తారు. మొదటిరోజు గణపతి పూజ, మూలమంత్రం, జపములు, అంకురార్పణ, 30న ఉదయం 11 గంటలకు లక్ష్మీనృసింహ్మస్వామి కల్యాణం జరుపబడుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. బ్రహ్మోత్సవాలు జరుగు రెండు రోజుల పాటు, భక్తులకు అన్నదానం చేపట్టనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

నిషేధిత జాబితానుంచి తొలగించండి

జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్



జిల్లా పరిశ్రమలశాఖ మేనేజర్‌కు వివరాలు అందజేస్తున్న దశరథ్‌నాయక్, తదితరులు

కడ్తాల్: ధరణి నిషేధిత జాబితాలో కడ్తాల్, కర్కల్‌పహాడ్, ముద్విన్ గ్రామాలకు చెందిన పలువురి రైతుల పొలాలను ధరణి నిషేధిత జాబితా నుంచి తొలగించాలని జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ పేర్కొన్నారు. శనివారం స్థానిక నాయకులతో కలిసి, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ శ్రీలక్ష్మీని కలిసి వివరాలు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ మాట్లాడుతూ ఫార్మాసిటీ ఏర్పాటు పేరుతో గతంలో ఈ ప్రాంతంలో ప్రభుత్వ భూములు సేకరించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ విషయంలో రెవెన్యూ పరిశ్రమల శాఖ అధికారుల మధ్య సమన్వయ లోపంతో ఫార్మాసిటీ పరిధిలోనికి రాని వ్యవసాయ భూములను కూడా నిషేధిత జాబితాలో చేర్చారు. దీంతో రైతులు రుణాలు పొందడానికి, అవసరాల కోసం క్రయ విక్రయాలు నిర్వహించలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని జిల్లా స్టాండింగ్ కమిటీ సమావేశంలో కూడా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. ఐనప్పటికీ కూడా రైతులకు న్యాయం జరగలేదన్నారు. ఇట్టి విషయమై జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు నిషేధిత జాబితాలో ఉన్న వ్యవసాయ పొలాల వివరాలు ఇవ్వాలని కోరడంతో శనివారం వివరాలు అందించినట్లు పేర్కొన్నారు. వెంటనే ఫార్మాసిటీ పరిధిలోకి రాని వ్యవసాయ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా, సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, వైస్‌ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీ లచిరామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భారీగేట్లు ఏర్పాటు చేయాలని వినతి

తలకొండపల్లి: మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ ప్రాంతంలో భారీగేట్లు ఏర్పాటు చేయాలని బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ అనిల్ డిమాండ్ చేశారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ మీదుగా స్వామి వివేకానంద విగ్రహం వరకు నాలుగు భారిగేట్లు ఏర్పాటు చేయాలని ఆయన పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అనిల్ ఆధ్వర్యంలో స్థానికులు ఎంపీడీఓ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో భాగంగా మండల కేంద్రంలో రోడ్లు వెడల్పు కావడంతో వాహనాలు అతి వేగంగా ప్రయాణించి ప్రమాదాలు సంభవించే పరిస్థితి నెలకొన్నాయని ఎంపీడీఓకు విన్నవించారు. భారిగేట్లు ఏర్పాటు చేయడంతో వేగాన్ని నియంత్రించి ప్రమాదాలను అరికట్టవచ్చని చెప్పారు. గతంలో కొందరు ప్రాణాలు కోల్పోగా, మరి కొందరు తీవ్ర గాయాలతో ఆస్పత్రుల్లో చేరి చికిత్స చేయించుకున్నట్లు చెప్పారు. గత అనుభవాల దృష్ట్యా భారిగేట్లు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని ఎంపీడీఓను అనిల్ కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్, గణేష్, శ్రీనివాస్, అనిల్, దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతలో తిరుగులేని 'భారతి'



పెద్దఅంబర్‌పేటలో తాపీమేస్త్రీలకు బీమా పత్రాలను అందజేస్తున్న భారతీ సిమెంట్ సంస్థ ప్రతినిధులు

అబ్దుల్లాపూర్‌మెట్: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5స్టార్ గ్రేడ్ తెలంగాణలో విడుదల చేసిందని ఆ సంస్థ సీనియర్ టెక్నికల్ ఇంజినీర్ శివకుమార్ పేర్కొన్నారు. పెద్దఅంబర్‌పేటలోని లక్ష్మారెడ్డిపాలెంలో ముత్యంస్టీల్ హౌస్ డీలర్ షాప్‌లో శుక్రవారం రాత్రి తాపీ మేస్త్రిలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతి అల్ట్రా ఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతంగ పూర్తవుతుందన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందచేస్తామని స్లాబ్ కాంక్రిట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడుతారని తెలిపారు. 60 మంది తాపీ మేస్త్రీలకు రూ.లక్ష చొప్పున ప్రమాద బీమా బాండ్లు అందజేశారు. డీలర్ నాగార్జున యాదవ్ మాట్లాడుతూ భారతి సిమెంట్ సరీస్ వేగంగా ఉంటుందన్నారు. డీలర్లు మల్లిఖార్జున్‌రెడ్డి, రవి, డిప్యూటీ మేనేజర్ రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రాక

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో జరుగుతున్న బొడ్రాయి ఉత్సవాలకు స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదివారం వస్తున్నట్లు కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు ఆకుల ఆనంద్‌కుమార్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకు లు, కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

బాధ్యతలు స్వీకరణ



బి.చంద్రశేఖర్

తుర్కయంజాల్: పురపాలక సంఘం ఇన్‌చార్జి కమిషనర్‌గా బి చంద్రశేఖర్ శనివారం మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మీర్‌పేట కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయనకు తుర్కయంజాల్‌ను అదనంగా కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

తీన్మార్ మల్లన్నను గెలిపించండి

పెరిక కుల కార్పొరేషన్ సాధన సమితి అసోసియేట్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ రావు



మాట్లాడుతున్న మల్లిఖార్జున్ రావు

అబ్దుల్లాపూర్‌మెట్: ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న తీన్మార్ మల్లన్నకు పట్టభద్రులంతా ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర పెరిక కుల కార్పొరేషన్ సాధన సమితి అసోసియేట్ అధ్యక్షుడు కోట మల్లిఖార్జున్ రావు కోరారు. శనివారం పెద్ద అంబర్‌పేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తీన్మార్ మల్లన్నకు ఓటు వేసేందుకు పెరిక సంఘం ఏకగ్రీంగా నిర్ణయించామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి తమ కులానికి 100 రోజుల్లో కార్పొరేషన్ ఏర్పాటు చేసి గెజిట్ ఇచ్చారని, గత ప్రభుత్వాలకు తాము మొరపెట్టుకున్నా పట్టించుకోలేదన్నారు. పెరిక సంఘం గ్రాడ్యుయేట్స్ అంతా తీన్మార్ మల్లన్నకే ఓటు వేయాలని కోరారు. పదేళ్లుగా బీఆర్‌ఎస్ ఒక ఉద్యోగం కూడా ఇవ్వలేదని, లీకేజీల పేరుతో నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. గత ప్రభుత్వాలు నిరుద్యోగుల పట్ల చిన్నచూపు చూపించాయని, మేధావులు కుల సంఘాలు అంతా తీన్మార్ మల్లన్నకు మద్దతు ఇచ్చి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడు దాచేపల్లి రవి, రంగారెడ్డి అధ్యక్షుడు జోకూరి రాజు, నరసయ్య, అనిరుద్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా ఆవిర్భావ వేడుకలు

మాజీ ఎంపీ డాక్టర్ మల్లు రవి



మాట్లాడుతున్న మల్లురవి

ఆమనగల్లు: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం చరిత్రలో నిలిచి పోయేలా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తుందని పీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ డాక్టర్ మల్లురవి పేర్కొన్నారు. జూన్ 2న పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ హాజరవుతున్నారని ఆయన చెప్పారు. ఆమనగల్లు పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఈసీ అనుమతి ఇచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. 6 దశాబ్దాల తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర కలను సాకారం చేసిన ఘనత సోనియాగాంధీదే అని ఆయన అన్నారు. ఈ వేడుకల నేపథ్యంలో సోనియాగాంధీని ముఖ్య అతిథిగా ఆహ్వానించి రాష్ట్ర ప్రభుత్వం తరఫున సన్మానించనున్నట్లు ఆయన చెప్పారు. ఈ సమావేశంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడురి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

పట్టు పురుగుల పెంపకంపై అవగాహన

తలకొండపల్లి: బల్సులపల్లి తండాలో ఈ నెల 28న తలకొండపల్లి, ఆమనగల్లు, కడ్తాల్ రైతులకు పట్టు పురుగుల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించబడుతుందని జిల్లా పట్టు పరిశ్రమ సహాయ సంచాలకులు ముత్యాలు శనివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారిణి నీరజగాంధీ, జాయింట్ డైరెక్టర్ లత, ఉప సంచాలకులు లక్ష్మయ్య, సైంటిస్టు డాక్టర్ మాధురి హాజరవుతారని జిల్లా సహాయ సంచాలకులు ముత్యాలు చెప్పారు. ఉదయం 10 గంటలకు కాలు నాయక్ షెడ్ వద్ద నిర్వహించబడు అవగాహన కార్యక్రమానికి ఆసక్తి గల రైతులు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయగలరని ఆయన కోరారు.

రైతులను మోసం చేస్తే చర్యలు తప్పవు

మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత ● పలు విత్తన, ఎరువుల దుకాణాల తనిఖీ



యాచారం: అవగాహన కల్పిస్తున్న అధికారులు



కడ్తాల్: ముద్విన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న శ్రీలత

కడ్తాల్: నకిలీ విత్తనాలు విక్రయించి, రైతులను మోసం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని ముద్విన్ గ్రామంలోని పలు ఎరువుల, విత్తన దుకాణాలను వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా ఎరువుల దుకాణాలలో యూరియా, కాంప్లెక్స్ ఎరువుల నిల్వ, అమ్మకాలు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత మాట్లాడుతూ అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈపాస్ ద్వారానే విక్రయించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎరువులను విక్రయించాలని, లేకుంటే సంబంధిత డీలర్ షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు.

తలకొండపల్లిలో

తలకొండపల్లి: నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరంగా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఏఓ రాజు హెచ్చరించారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని ఆగ్రో రైతుసేవా కేంద్రం, లక్ష్మీనరసింహ్మ ట్రేడర్స్, వెంకటసాయి ట్రేడర్స్, జై కిసాన్ సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ విత్తన విక్రయ డీలర్ల దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలం చెల్లిన విత్తనాలు విక్రయించొద్దన్నారు. విత్తనాలు విక్రయించే సమయంలో విధిగా రశీదు ఇవ్వాలని సూచించారు. రశీదులో తప్పనిసరిగా ధర, లాట్ నెంబర్, కాల పరిమితి నమోదు చేయాలని పేర్కొన్నారు.

యాచారంలో..

యాచారం: వానాకాలం పంటల సాగు ప్రారంభమవుతున్న దష్ట్యా విత్తనాల కొనుగోళ్లల్లో రైతులు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని యాచారం మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్ సూచించారు. శనివారం వ్యవసాయ శాఖ అధికారులు గునుగల్, కుర్మిద్ద తదితర గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాల కొనుగోళ్లల్లో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యాపారుల మాయమాటలు నమ్మి అధిక ధరలకు విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత దుకాణం నుంచి కచ్చితంగా రశీదులు తీసుకోవాలని సూచించారు. విత్తన ప్యాకెట్లు మరియు బిల్లు రశీదులను పంట కాలం ముగిసే వరకు జాగ్రత్తగా దాచిపెట్టాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు ఉన్న దుకాణాల్లోనే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని తెలియజేశారు. విత్తనాల కొనుగోలులో ఎవైనా ఇబ్బందులు ఉంటే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసిన మంగ జగదీశ్‌యాదవ్



మున్సిపల్ చైర్ పర్సన్ స్రవంతి, మంగ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్ చైర్ పర్సన్‌గా నూతనంగా ఎన్నుకోబడిన బర్ల మంగజగదీశ్‌యాదవ్ చైర్‌పర్సన్ స్రవంతి ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిశారు. తాను వైస్ చైర్ పర్సన్ అయ్యేందుకు పూర్తి స్థాయిలో సహకరించి, తన విజయానికి తోడ్పాటునందించిన మల్‌రెడ్డికి ఎల్లవేళలా రుణపడి ఉంటానని బర్ల మంగ తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కౌన్సిలర్లు ఇందిరాల రమేశ్, నీళ్ల భాను గౌడ్, ఆకుల మమతఆనంద్, జెర్కొని బాల్‌రాజ్, నరాల విశాలవిద్యాసాగర్, జగన్, తాళ్ల మహేశ్‌గౌడ్, బర్ల జగదీశ్‌యాదవ్, పాల్గొన్నారు.

సమిష్టి కృషితో అభివృద్ధి... ఎమ్మెల్యే మల్‌రెడ్డి

సమష్టి కృషితో ఇబ్రహీంపట్నం మున్సిపాలిటి అభివృద్ధి సాధ్యమైందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. పురపాలకవర్గం కలిసికట్టుగా అభివృద్ధి పనుల్లో బాగస్వాములై ప్రజల మన్ననలను పొందాలన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి తన పూర్తి సహాయసహకారాలు ఉంటాయని మల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భగా మున్సిపల్ నూతన వైస్ చైర్ పర్సన్‌గా ఎన్నికైన బర్ల మంగను అభినందించారు.